
## దేవ్‌రావు అంత్యక్రియల్లో పాల్గొన్న రామన్న

బేల, జనవరి 19 : రేణిగూడ గ్రామానికి చెందిన రైతు జాదవ్ దేవ్‌రావు అంత్యక్రియల్లో మాజీ మంత్రి జోగు రామన్న, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన భౌతిక కాయం వద్ద నివాళులర్పించి పూలమాల వేశారు. అనంతరం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా రామన్న మాట్లాడుతూ.. జాదవ్ దేవ్‌రావు మరణం ఆదిలాబాద్ జిల్లాను తీవ్రంగా కలచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం రైతులకు ఇస్తానన్న రూ.2 లక్షల రుణమాఫీ చేయక పోవడంతోనే అమాయక రైతులు బలి అవుతున్నారని మండిపడ్డారు. మృతి చెందిన దేవ్‌రావు కుటుంబాన్ని బ్యాంక్ అధికారులు, ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.


దేవ్‌రావు భౌతిక కాయం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి రామన్న



*ఆదిలాబాద్ జిల్లాలో రైతన్నలు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. రెండు నెలల వ్యవధిలో ఐదుగురు.. ఈ రెండు రోజుల్లో ఇద్దరు ఆత్మహత్య చేసుకున్నారు. ప్రధానంగా సాగు కలిసిరాకపోవడం, దిగుబడి తగ్గడం, ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టం, ప్రైవేటు అప్పులు, బ్యాంకు అధికారుల వేధింపులతో మృత్యువాత పడుతున్నారు. భూ తల్లిని నమ్ముకుని, రాత్రింబవళ్లు శ్రమించి సాగు చేసిన పంటలు చేతికి రాకపోవడంతో నిర్ణయాలు తీసుకుంటున్నారు. మరోవైపు ప్రభుత్వం రుణమాఫీ కూడా పూర్తిస్థాయిలో చేయకపోవడంతో మదనపడుతున్నారు. అప్పులు తీర్చే మార్గం లేక పురుగుల మందునే పెరుగన్నంలా.. తలుగులనే ఉరితాళ్లుగా మలచుకుంటున్నారు.*

# రైతన్నల బలవన్మరణం

**పంట దిగుబడి రాక.. అప్పులు తీర్చలేక ఆత్మహత్యలు**

- బ్యాంకు అధికారుల వేధింపులు.. సర్కారు రుణమాఫీ పూర్తి కాక..
- రెండు నెలల్లో ఐదుగురు.. ఈ రెండు రోజుల్లో ఇద్దరు..
- పురుగుల మందునే పెరుగన్నంలా.. తలుగులనే ఉరితాళ్లుగా..


ఆదిలాబాద్, జనవరి 19(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లాలో 1.63 లక్షల మంది రైతులు ఉన్నారు. వానకాలంలో 5.78 లక్షలు, యాసంగిలో 1.80 లక్షల ఎకరాల వరకు సాగు చేస్తారు. వీరితోపాటు 28,763 మంది కౌలు రైతులు ఉన్నారు. ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా వానకాలంలో పత్తి, సోయా, కంది పండిస్తారు. యాసంగిలో శనగ, జొన్న, గోధుమ సాగు చేస్తారు. రైతులు పెట్టుబడి కోసం బ్యాంకుల్లో రుణం తీసుకోవడంతోపాటు ప్రైవేటు అప్పులు చేస్తారు. కౌలు రైతులు ఎక్కువగా ప్రైవేటు అప్పులపైనే ఆధారపడుతారు. యేటా వానకాలంలో పత్తి సాగుకు అనుకూలమైన భూములు ఉండడంతో నాలుగు లక్షల ఎకరాల వరకు సాగవుతుంది. సోయాబిన్ 90 వేలు, కంది 70 వేల ఎకరాల్లో సాగు చేస్తారు.

### పంట నష్టానికి కారణాలు

రైతులు అధికంగా పండించే పత్తిలో పలు జాగ్రత్తలు తీసుకోవాలి. విత్తనాల ఎంపిక మొదలుకుని, వర్షాలు అనుకూలించడం, తెగుళ్లు, చీడ-పీడల నివారణలో రైతులు అప్రమత్తంగా ఉండాలి. విత్తనాలు వేసిన తర్వాత వర్షాలు పడకపోవడం, పూత, కాత దశలో వానలు అధికంగా పడడంతోపాటు గులాబీ రంగు పురుగు వంటి సమస్యలు అధిగమించాలి. సాగునీటి వనరులు తక్కువగా ఉండడంతో రైతులు వర్షాలపై ఆధారపడి వానకాలం పంటలు వేస్తారు. సకాలంలో వర్షాలు పడితే పంటలు పండుతాయి. జూన్‌లో వేసిన పత్తి డిసెంబరు వరకు, కంది జనవరి చివరి వరకు ఉంటుంది. ఈ సాగులో రిస్క్ కూడా ఎక్కువగానే ఉంటుంది. సాగులో భాగంగా పరిస్థితులు అనుకూలించకపోతే నష్టపోవాల్సి వస్తుంది.

### పంట పెట్టుబడులు

ఆదిలాబాద్ జిల్లాలో రైతులు వానకాలం పంటల కోసం అధికంగా అప్పులు చేస్తారు. పెట్టుబడి కోసం బ్యాంకుల్లో రుణాలు, దళారులు వద్ద అప్పులు తీసుకుంటారు. దళారులు, ప్రైవేటు అప్పుల కోసం అధిక వడ్డీ చెల్లిస్తారు. కౌలు రైతుల పరిస్థితి దయనీయంగా ఉంటుంది. వారు కౌలు డబ్బులతోపాటు సాగు కోసం ఎక్కువ ఖర్చు చేస్తారు. వీరు పూర్తిగా ప్రైవేటు అప్పులపై ఆధారపడుతారు. ఏజెన్సీ ప్రాంతాలతోపాటు పలు మండలాల్లోని గ్రామాల్లో దళారులు విత్తనాలు, ఎరువులు, పెట్టుబడుల కోసం డబ్బులు ఇచ్చి పంటలను తమకే విక్రయించాలనే షరతులు విధిస్తారు. దీంతో రైతులు కష్టపడి సాగు చేసిన పంటలను తక్కువ ధరకు వారికి అమ్మి నష్టపోవాల్సి వస్తుంది.



### ఆత్మహత్య చేసుకున్న రైతులు



| | |
|---|---|
| తేదీ | : డిసెంబర్ 1 |
| పేరు | : దోగ్రి జ్ఞానేశ్వర్(43) |
| గ్రామం | : జున్ని |
| మండలం | : ఇచ్చోడ |
| వ్యవసాయ భూమి | : ఐదెకరాలు |
| కారణం | : దిగుబడి రాక, అప్పులు తీర్చలేక.. |
| ఎలా చనిపోయాడు | : పొలం వద్దే చెట్టుకు ఉరివేసుకుని.. |



| | |
|---|---|
| తేదీ | : డిసెంబర్ 27 |
| పేరు | : వాగుమూడే రాజేందర్(53) |
| గ్రామం | : టాకిగూడ |
| మండలం | : గుడిహత్నూర్ |
| కారణం | : నాలుగో విడుత రుణమాఫీ జాబితాలో పేరు రాలేదు.. |
| తీసుకున్న రుణం | : బ్యాంకు ఆఫ్ మహారాష్ట్రలో రూ.2.50 లక్షలు |
| ఎలా చనిపోయాడు | : ఇంట్లో పురుగుల మందు తాగాడు |



| | |
|---|---|
| తేదీ | : జనవరి 11 |
| పేరు | : కినక శంకర్(38) |
| గ్రామం | : పిప్రి |
| మండలం | : ఇంద్రవెల్లి |
| కారణం | : అతివృష్టి కారణంగా దిగుబడి రాలేదు.. |
| తీసుకున్న రుణం | : ప్రైవేటు వ్యాపారి వద్ద రూ.2 లక్షలు |
| ఎలా చనిపోయాడు | : పురుగుల మందు తాగాడు |



| | |
|---|---|
| తేదీ | : జనవరి 18 |
| పేరు | : జాదవ్ దేవ్‌రావు(51) |
| గ్రామం | : రేణిగూడ |
| మండలం | : బేల |
| వ్యవసాయం | : ఐదెకరాలు |
| కారణం | : బ్యాంకు అధికారుల వేధింపులు |
| తీసుకున్న రుణం | : ప్రైవేట్ బ్యాంకులో రూ.3.50 లక్షలు, రామాయి డీజీబీ బ్యాంకులో రూ.2 లక్షల పంట రుణం, ప్రైవేటు వ్యక్తి వద్ద రూ.లక్ష |
| ఎలా చనిపోయాడు | : బ్యాంకులో ఆవరణలోనే పురుగుల మందు తాగాడు |




| | |
|---|---|
| తేదీ | : జనవరి 19 |
| పేరు | : రాథోడ్ గోకుల్(40) |
| గ్రామం | : లింగోజీ తండా |
| మండలం | : ఉట్నూర్ |
| వ్యవసాయం | : పదెకరాలు (కౌలుకు తీసుకున్నాడు) |
| కారణం | : పంటలు సరిగా పండకపోవడం, ఆర్థిక ఇబ్బందులు |
| తీసుకున్న రుణం | : ప్రైవేటుగా రూ.10 లక్షలు |
| ఎలా చనిపోయాడు | : పురుగుల మందు తాగాడు |

## అర్హులందరికీ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు

- గ్రామసభల్లో దరఖాస్తుల స్వీకరణ
- రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ
- ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

ఎదులాపురం, జనవరి 19 : అర్హులందరికీ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల ఫీల్డ్ వెరిఫికేషన్, గ్రామసభలపై ఆదివారం గూగుల్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదేశాల మేరకు ఈనెల 21 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించే గ్రామసభలకు విస్తృత ఏర్పాట్లు చేయాలని సూచించారు. గతంలో నిర్వహించిన ప్రజపాలన గ్రామసభల మాదిరిగానే నిర్వహించాలని, రోజు ఒక గ్రామ పంచాయతీలో మాత్రమే గ్రామసభలు నిర్వహించాలని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు జారీ చేస్తామని, రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఇండ్ల పథకం నిరంతరం ప్రక్రియ అని అన్నారు. గ్రామసభల్లో దరఖాస్తులను స్వీకరించడంతోపాటు ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను కూడా పరిశీలిస్తామని, ప్రస్తుతం ప్రచారంలో ఉన్న రేషన్ కార్డుల లబ్ధిదారుల జాబితా కులగణన(సామాజిక) సర్వే ఆధారంగా తయారు చేసిందని, ఇది తుది జాబితా కాదని పేర్కొన్నారు. గ్రామసభలో కలెక్ట్ చేసేటప్పుడు హెడ్ ఆఫ్ ద ఫ్యామిలీ నంబర్, పేర్లు, ఆధార్ నంబర్, మొబైల్ నంబర్ అడ్రస్ తీసుకోవాలన్నారు. ఎవరిదైనా పేర్లు మిస్ అయితే ప్రజాపాలన మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. రేషన్ కార్డులకు సంబంధించి ప్రతిదీ రిజిష్టర్‌లో నమోదు చేయాలన్నారు. ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి ఇంటి స్థలం ఉన్న వారి జాబితా ఇంటి స్థలం లేని వారి రెండు జాబితాలను గ్రామ సభలలో ప్రదర్శించాలన్నారు. అలాగే కొత్తగా గ్రామ సభలలో వచ్చే దరఖాస్తులను కూడా పరిశీలించాలని సూచించారు. వ్యవసాయ, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా రైతు భరోసా లబ్ధిదారులను గుర్తించాలన్నారు. ఉపాధి హామీ పథకంలో కనీసం ఇరవై రోజులపాటు కూలి పనికి వెళ్లిన వారికే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వర్తిస్తుందని తెలిపారు. ప్రతి కుటుంబంలో మహిళల బ్యాంకు ఖాతాలకే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా మొత్తాన్ని బదిలీ చేస్తామన్నారు. గూగుల్ మీట్‌లో ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, అదనపు కలెక్టర్ శ్యామలదేవి, సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మట్, సీఈవో జితేందర్ పాల్గొన్నారు.



గూగుల్ మీట్‌లో మాట్లాడుతున్న ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా


హత్య కేసు వివరాలు వెల్లడిస్తున్న నిర్మల్ ఏఎస్పీ రాజేశ్‌మీనా

## బాలుడి హత్య కేసును ఛేదించిన పోలీసులు

నిర్మల్ అర్బన్, జనవరి 19 : నిర్మల్ మండలంలోని చిట్యాల గ్రామంలో హత్యకు గురైన బాలుడు రిషి కేసును నిర్మల్ పోలీసులు ఛేదించారు. ఆదివారం నిర్మల్ ఏఎస్పీ రాజేశ్‌మీనా వివరాలను వెల్లడించారు. అడ్డిగ రాజమణి, ఆమె కుమారుడు రిషిలు కూలీ పని చేసుకుని జీవనం సాగిస్తున్నారు. రాజమణి భర్త పదేళ్ల క్రితం చెరువులో పడి ప్రమాదవశాత్తు మృతి చెందాడు. తల్లి, కుమారుడు వేర్వేరు చోట్ల కూలీ పనులు చేసుకుని ఉపాధి పొందుతున్నారు. ఈ క్రమంలో శుక్రవారం తల్లి, కుమారుడు వేర్వేరు చోట్ల కూలీ పనులకు వెళ్లారు. తల్లి ఇంటికి రాగా కుమారుడు రిషి రాత్రి 11 గంటలైనా ఇంటికి రాలేదు. శనివారం ఉదయం రిషి చిట్యాల గ్రామ శివారులోని చింతల చెరువు వద్ద హత్యకు గురై ఉన్నాడు. ఈ విషయాన్ని స్థానికులు పోలీసులకు తెలుపగా.. ఎస్సై లింబాద్రి కేసు నమోదు చేశారు. ఘటన స్థలాన్ని ఏఎస్పీ రాజేశ్‌మీనా, ఎస్పీ జానకి షర్మిల వెళ్లి పరిశీలించారు. డాగ్‌స్క్వాడ్ ద్వారా అనుమానాలు తలెత్తడంతో అనుమానితుడిని పట్టుకుని విచారించగా.. నేరం ఒప్పుకున్నాడు. కాగా.. చిట్యాల గ్రామానికి చెందిన తోకల రాజేశ్వర్‌కు హోమోసెక్స్ అలవాటు ఉంది. కామవాంఛ తీర్చుకోవడానికి ఈనెల 17వ తేదీన అర్ధరాత్రి చిట్యాలకు చెందిన రిషిపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ విషయం ఎవరికైనా తెలుస్తుందనే భయంతో మత్తులో బాలుడిపై అతి కిరాతకంగా బండరాయితో కొట్టి దారుణంగా హత్య చేశాడు. ఏఎస్పీ నేతృత్వంలోని టీం, జిల్లా డాగ్ స్క్వాడ్, క్రైం టీం నేరస్తుడిని పట్టుకున్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి

**బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్**

ఇచ్చోడ, జనవరి 19 : బోథ్ నియోజకవర్గంలో నెలకున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రం, అడిగామ(కే) గ్రామ పంచాయతీ పరిధిలోని ఎస్సీ కాలనీలో నాయకులతో కలిసి పర్యటించారు. ప్రజలతో ముచ్చటిస్తూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీలో నీటి సమస్య ఉందని తెలిపిన కాలనీ వాసులు కోరిక మేరకు బోరు కోసం తక్షణమే భూమిపూజ చేశారు. రానున్న 3, 4 రోజుల్లో బోరు వేయిస్తానని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సీ కమ్యూనిటీ హాలును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ ప్రీతంరెడ్డి పాల్గొన్నారు.


బోరు కోసం పూజ చేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

## ఫీజు చెల్లింపు గడువు పొడిగింపు

నిర్మల్ చైన్‌గేట్, జనవరి 19 : బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ట్యూషన్ ఫీజు చెల్లించేందుకు గడువు పొడిగించినట్లు కోఆర్డినేటర్ యు గంగాధర్, కళాశాల ప్రిన్సిపాల్ ఎం సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ సెకండ్, థర్డ్ ఇయర్ ట్యూషన్ ఫీజు గడువు జనవరి 25వ తేదీ వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు. డిగ్రీ 1,3,5 సెమిస్టర్ పరీక్షల ఫీజు జనవరి 30వ తేదీ లోపు చెల్లించాలని పేర్కొన్నారు. డిగ్రీ 5 సెమిస్టర్ పరీక్షలు మార్చి 1 నుంచి 6 వరకు 3వ సెమిస్టర్ మార్చి 7నుంచి 13వరకు, 1 సెమిస్టర్ పరీక్షలు మార్చి 15 నుంచి 21 వరకు జరుగుతాయని వెల్లడించారు. అదే విధంగా డిగ్రీ ఓల్డ్ బ్యాచ్‌కు చెందిన విద్యార్థులకు జనవరి 28 నుంచి ఫిబ్రవరి 8 వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. ఇతర వివరాలకు సెల్ నంబర్ 7382929703, 9848813998ను సంప్రదించాలని సూచించారు.